క్లుప్తంగా

ఆకట్టుకున్న సంగీత విభావరి



నారాయణమూర్తిని సత్కరిస్తున్న పైడిమాంబ దేవస్థానం అధికారులు, సిబ్బంది

విజయనగరం టౌన్: నగరంలోని శ్రీపైడితల్లి అమ్మవారి చదురుగుడి ఆవరణలో మంగళవారం రాత్రి నిర్వహించిన సంగీత విభావరి ఆకట్టుకుంది. ఈ సందర్భంగా వి.నారాయణ మూర్తి ఆర్కెస్ట్రా బృందం ఆలపించిన అమ్మవారి గీతాలు భక్తులను ఆద్యంతం అలరించారు. అనంతరం ఆలయ ఈవో డి.వి.వి. ప్రసాదరావు ఆధ్వర్యంలో నారాయణమూర్తిని దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో అమ్మవారి దేవస్థానం వేదపండితులు దూసి శివప్రసాద్, సాయి, పైడిమాంబ దీక్షా పీఠం వ్యవస్థాపకుడు ఆర్.సూర్యపాత్రో తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు విద్యాసంస్థల్లో అడ్డగోలు దోపిడీ



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ విక్రయాలు నిలిపివేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జె.రవికుమార్ డిమాండ్ చేశారు. స్థానిక ఎల్‌బీజీ భవన్‌లో మంగళవారం విలేకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలు దోపిడీకి అనేక మార్గాలు సృష్టించుకున్నాయని, దీనిలో భాగంగా పుస్తకాలు పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఇటువంటి వాటిపై ప్రభుత్వం దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పి.రమేష్, కె.రాజు, వెంకటరమణ, దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ సిబ్బంది కేటాయింపు

విజయనగరం అర్బన్: జూన్ 4న జిల్లా కేంద్రంలో నిర్వహించే సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు అవసరమైన సిబ్బందిని ర్యాండమైజేషన్ ద్వారా జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి మంగళవారం ఆయా నియోజకవర్గాలకు కేటాయించారు. మొత్తం 972 మందిని ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. అందులో 289 మంది కౌంటింగ్ సూపర్‌వైజర్లను, 340 మంది కౌంటింగ్ అసిస్టెంట్లను, 343 మంది మైక్రో అబ్జర్వర్లు ఉన్నారు. కార్యక్రమంలో జేసీ కార్తీక్, డీఆర్‌ఓ ఎస్‌డీ అనిత, డీఐఓ నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటపాటలతో కూడిన విద్య



చెస్ ఆడుతున్న చిన్నారులు

విజయనగరం అర్బన్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాల్లో విద్యార్థులకు ఆటపాటలతో కూడిన విద్యనందిస్తున్నారు. మంగళవారం గ్రంథాలయానికి విచ్చేసిన చిన్నారులతో ఆటపాటలు నేర్పించడంతో పాటు క్రీడలపై మక్కువ కల్పించారు. చదరంగం, వైకుంఠపాళి తదితర ఆటలను ఆడించి, వాటిలో నైపుణ్యం పెరిగేలా తర్ఫీదు ఇచ్చారు. ప్రాథమిక స్థాయి నుంచే ఆటపాటలతో పాటు క్రీడలపై మక్కువ పెంచుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.లక్ష్మి తెలిపారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకే



లారీ డ్రైవర్‌కు బ్రీత్ ఎనలైజర్‌తో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టు చేస్తున్న ఎస్ఐ లక్ష్మణరావు

బొండపల్లి: మద్యం తాగి వాహనాలు నడిపే వారికి రూ.10 వేల జరిమానా కానీ, జైలు శిక్ష కాని తప్పదని ఎస్ఐ కె.లక్ష్మణరావు అన్నారు. మండలంలో ని అంబటివలస, గొట్లాం గ్రామాల మధ్య జాతీయ రహదారి-26పై పోలీస్ సిబ్బందితో కలిసి మంగళవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఒడిశాకు చెందిన లారీ డ్రైవర్ మద్యం తాగి వాహనాన్ని నడుపుతున్నట్లు గుర్తించి కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లా డుతూ అధిక శాతం ప్రమాదాలు మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారి వల్లే జరుగుతున్నాయన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై వాహన చోదకులకు అవగాహన కల్పించారు.అలాగే సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ప్రజలంతా సహకరించాలని కోరారు. ఎన్నికల ఫలితాలు రోజున ర్యాలీలు, ప్రదర్శనలకు అనుమతి లేదని అన్నారు.

కోలగట్ల పుట్టినరోజున సేవా కార్యక్రమాలు



గంటస్తంభం వద్ద పార్టీ నగర అధ్యక్షుడు వేణు నేతృత్వంలో పాదరక్షల పంపిణీ

విజయనగరం: డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పుట్టినరోజు సందర్భంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ఆయన అభిమానులు పలు సేవా కార్యక్రమాలు మంగళవారం నిర్వహించారు. గంటస్తంభం వద్ద పార్టీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు నేతృత్వంలో పేదలకు పాదరక్షల పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కనకాల నాగవల్లి, మారోజు శ్రీనివాసరావు, కాళ్ల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు. పైడితల్లి దేవస్థానం వద్ద వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి ఈ కార్యక్రమంలో పాల్గొని, నిరుపేదలకు ఆహారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు అల్లు చాణక్య, బండారు ఆనందరావు, పైడితల్లమ్మ ట్రస్ట్ బోర్డు మెంబర్లు పతివాడ వెంకట్రావు, తాడ్డి సురేష్ తదితరులు పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా ఆధ్వర్యంలో కోట సమీపంలో ఉన్న ఫుడ్ బ్యాంక్ వద్ద అయ్యప్ప, నవీన్ తదితరులు కలిసి అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. పార్టీ జోనల్ ఇన్‌చార్జ్ మారం బాలబ్రహ్మారెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి, పేదలకు ఉచిత వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. సర్వజన ఆస్పత్రి, గోషాస్పత్రి, ప్రేమ సమాజంలలో రోగులకు, వృద్ధులకు ఆయా జోనల్ ఇన్‌చార్జ్‌ల ఆధ్వర్యంలో పండ్లు రొట్టెలు పంచిపెట్టారు. బాబామెట్ట, రింగ్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో అన్నదానం, దాసన్నపేటలో మజ్జిగ పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పొంతపల్లి మాలతి, బోనసింగి ఈశ్వరరావు, గాదం మురళి, గోపి తదితరులు పాల్గొన్నారు. ఆడారి బుజ్జి ఆధ్వర్యంలో రంగాల వీధిలో భారీ అన్నసంతర్పణ నిర్వహించారు. నగరంలో ఉన్న మిగిలిన ఐదు ఫుడ్ బ్యాంకుల వద్ద వైఎస్సార్ సీపీ శ్రేణులు పేదలకు ఆహారాన్ని అందించారు. ఇలా నగరమంతా పలు సేవా కార్యక్రమాలతో కోలగట్ల పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు.



అన్నదాన కార్యక్రమంలో అన్నం వడ్డిస్తున్న నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి



ఫుడ్‌బ్యాంకుల ద్వారా పేదలకు అన్నదానం చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సూర్యనారాయణ



ర్యాలీని ప్రారంభిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సూర్యనారాయణ

విజయనగరం ఫోర్ట్: మహిళలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.సూర్యనారాయణ అన్నారు. ప్రపంచ రుతుక్రమ పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా స్థానిక కెఎల్‌పురం యూపీహెచ్‌సీ వద్ద మంగళవారం అవగాహనా కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. రుతుక్రమం సమయంలో మహిళలు తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలు, పౌష్టికాహారం, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనారోగ్య సమస్యలు వచ్చినపుడు అశ్రద్ధ చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతకు గురికాకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఈఓ బీఎస్ మూర్తి, డీపీఓ మృదుల, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ తేజస్విని, ఆర్‌కేఎస్‌కే కౌన్సిలర్ ఎ.కొండమ్మ, ఏఎన్ఎం చాందిని, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



ర్యాలీలో భోగాపురం ఐసీడీఎస్ పీవో ఎస్తేరురాణి, వైద్యారోగ్య సిబ్బంది

పూసపాటిరేగ: వరల్డ్ మెన్‌స్ట్రువల్ హైజీన్ డే(ప్రపంచ రుతు పరిశుభ్రతా దినోత్సవం) సందర్భంగా మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న భోగాపురం ఐసీడీఎస్ పీవో ఎస్తేరు రాణి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటిస్తేనే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందన్నారు. ముఖ్యంగా మహిళలు రుతుస్రావం సమయంలో తగిన జాగ్రత్తలు పాటిస్తూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. నెలసరి సమయంలో పరిశుభ్రత పాటించకపోతే లైంగిక ఇన్‌ఫెక్షన్, గర్భాశయ క్యాన్సర్లు వచ్చే అవకాశం ఉందన్నారు. వైద్యాధికారి ప్రమీలాదేవి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ రోజువారీ తినే ఆహారంలో పౌష్టికాహారం ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో పూసపాటిరేగ పీహెచ్‌సీ వైద్యాధికారి రాజేష్‌వర్మ, హెల్త్ ఎడ్యుకేటర్ మహేశ్వరి, హెల్త్ అసిస్టెంట్ రమణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఆటపాటలతో జీవితం ఆనందమయం



విద్యార్థులతో జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు

విజయనగరం ఫూల్‌బాగ్: ఆటపాటలతో ఆనందమయమైన జీవితాన్ని పొందవచ్చని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు వెంకటరావు అన్నారు. జనవిజ్ఞాన వేదిక విజయనగరం జిల్లా సమత విభాగం ఆధ్వర్యంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న వేసవి వినోదం కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంవీఎస్ వెంకటరావు మాట్లాడుతూ.. వేసవి సెలవుల్లో విద్యార్థులు సమయం వృథా చేయకుండా విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. పిల్లలకు చిన్నతనం నుంచే పర్యావరణ పరిరక్షణపై ఆసక్తి కలిగించాలన్నారు. అనంతరం పిల్లలతో మొక్కలు నాటించారు. కార్యక్రమంలో సమత రాష్ట్ర కన్వీనర్ నిర్మల నాయకులు శశికళ, ఐద్వా జిల్లా నాయకులు జగదాంబ పాల్గొన్నారు.

ప్రత్యేకావసరాల చిన్నారుల గుర్తింపు సర్వే



ఊడికలపేటలో సర్వే చేస్తున్న ఐఈఆర్‌టీలు

డెంకాడ: మండలంలోని ఊడికలపేట గ్రామంలో ప్రత్యేకావసరాల చిన్నారుల గుర్తింపు సర్వే మంగళవారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి, దివ్యాంగులు ఎవరైనా ఉన్నారా అని వివరాలు సేకరించారు. గ్రామగ్రామానికి వెళ్తున్న ఐఈఆర్‌టీలు కె.అప్పలరాజు, బి.రవీంద్రలు 18 ఏళ్లలోపు దివ్యాంగ చిన్నారులను గుర్తిస్తున్నారు. అనంతరం భవిత కేంద్రాల్లో దివ్యాంగ చిన్నారులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వివరిస్తున్నారు. ఇప్పటివరకు 11 మంది విభిన్న ప్రతిభావంతులైన పిల్లలను గుర్తించామని వారు తెలిపారు.

రుచికరంగా భోజనాలు వండిపెట్టాలి

- జిల్లా ఉపవిద్యాశాఖధికారి కేవీ రమణ



మాట్లాడుతున్న జిల్లా ఉపవిద్యాశాఖధికారి కేవీ రమణ

నెల్లిమర్ల: ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం కింద ప్రతిరోజూ వంట చేసి విద్యార్థుల కడుపు నింపే ఎండీఎం మహిళలు అన్నపూర్ణకు ప్రతిరూపమని జిల్లా ఉపవిద్యాశాఖధికారి కేవీ రమణ అన్నారు. స్థానిక గవర్నమెంట్ ఉన్నత పాఠశాలలో ఎండీఎం నిర్వాహకులకు మంగళవారం ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డిప్యూటీ ఈఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అనేక సదుపాయాలు కల్పిస్తోందన్నారు. ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాం, షూ, తదితర వస్తువులతో పాటు మధ్యాహ్న భోజనం కింద పౌష్టికాహారం అందిస్తోందన్నారు. వంట నిర్వాహకులు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ మేరకు భోజనాలు రుచికరంగా వండిపెట్టాలని సూచించారు. భోజనాలు మరింత రుచిగా ఎలా వండాలో వీడియో పాఠాలతో శిక్షణ ఇచ్చారు. అనంతరం వారితో వివిధ రకాల వంటకాలను వండించారు. రుచికరంగా వండిన వారిని అభినందించారు. కార్యక్రమంలో జిల్లా ఎండీఎం కో-ఆర్డినేటర్ కె.సత్యం, నెల్లిమర్ల ఎంఈఓ యు.ఎస్.ఎన్.మూర్తి, విజయనగరం ఎంఈఓ సీహెచ్ ఆనంద మూర్తి, గుర్ల ఎంఈఓ-2 ఎం.శ్రీనివాసరావు, ఆర్‌పీలు ఎ.కిరణ్‌కుమార్, రమా, సీఆర్‌ఎంటీలు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

రామతీర్థంలో హుండీల కానుకల లెక్కింపు నేడు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీసీతారామస్వామి దేవస్థానంలో హుండీల్లో భక్తుల కానుకల రూపంలో చేరిన ఆదాయాన్ని బుధవారం లెక్కిస్తున్నామని దేవస్థానం ఈవో శ్రీనివాసరావు ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. దేవదాయ శాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణలో రాములోరి ఆలయంలో ఉన్న హుండీలతో పాటు ఆలయ క్షేత్ర పాలకులైన ఉమాసదాశివస్వామి ఆలయంలో ఉన్న హుండీల కానుకలను కూడా లెక్కిస్తామన్నారు. జిల్లాకు చెందిన శ్రీవారి సేవా భక్తులంతా లెక్కింపులో పాల్గొంటారన్నారు.

శాంతియుతంగా సమస్యలు పరిష్కరించుకోవాలి

- జిల్లా పర్మినెంట్ లోక్ అదాలత్ జడ్జి జి.దుర్గయ్య



మాట్లాడుతన్న జిల్లా లీగల్ సెల్ అథారిటీ సీనియర్ సివిల్ జడ్జి దుర్గయ్య

భోగాపురం: గ్రామీణ ప్రాంతాల్లో నెలకొనే సమస్యలను శాంతియుత వాతావరణంలో పరిష్కరించుకోవాలని జిల్లా పర్మినెంట్ లోక్ అదాలత్ జడ్జి జి.దుర్గయ్య తెలిపారు. మండలంలోని నందిగాం గ్రామంలో సర్పంచ్ గొరే మురళీమోహన్‌రావు ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోనే ఎటువంటి కోర్టు వివాదాలు లేని పంచాయతీ నందిగాం పంచాయతీ అని ప్రశంసించారు. మీ.. మీ.. గ్రామాల్లోనూ ఎటువంటి భూ సమస్యలున్నా, ఏ ఇద్దరు వ్యక్తుల మధ్య తగాదాలు ఉన్నా గ్రామపెద్దల సమక్షంలో పరిష్కరించుకోవాలని, లేకపోతే జిల్లా లీగల్‌సెల్ అథారిటీ లేదా లా ప్లస్‌కు దరఖాస్తు చేసుకున్నట్లయితే ఎటువంటి ఫీజు లేకుండా ఫ్రీ లాయర్‌ను పెట్టి మీ సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో లీగల్ సెల్ అథారిటీ సెక్రటరీ సివిల్ జడ్జి కె.విజయ కల్యాణి, తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్, ఎంపీడీవో జి.చంద్రకళ, సీఐ రవికుమార్ పాల్గొన్నారు.

అంబరాన్నంటిన ధారగంగమ్మ సంబరం

- వైభవంగా ధారగంగమ్మ అనుపోత్సవం
- జనంతో కిక్కిరిసిన ఎస్.కోట
- సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి



ఊరేగింపులో శ్రీదేవి, శ్రీవారు, భూదేవి వేషధారులు



అమ్మవారి ఘటాల ఊరేగింపు

శృంగవరపుకోట: ఎస్.కోట గ్రామదేవత ధారగంగమ్మ పండగ అదరహో అన్నట్టుగా సాగింది. అంబరాన్నంటేలా సంబరం సాగడంతో పట్టణం అంతా పండగ పారవశ్యంలో మునిగింది. పట్టణంలో ఎటు చూసినా జనం, ఏ వీధి చూసినా కోలాహలమే. మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి దారగంగమ్మ అమ్మవారి అణుపోత్సవం ఆరంభం అయ్యింది. గొల్లవీధిలో ఉన్న అమ్మవారి గద్దె ఇంటి వద్ద ధార గంగమ్మ అమ్మవారి ఆలయపూజారి వచ్చి ఘటాలు ఎత్తడంతో పండగ ప్రారంభం అయ్యింది. అక్కడ ఆలయ అనువంశిక పూజారి మోపాడ గౌరినాయుడుకు ఆశీర్వచనం చెప్పి స్వాగతం పలికారు. అదే సమయంలో సాలివీధి నుంచి అమ్మవారి దేవరప్రభను తెచ్చారు. దేవరను స్థానిక వైద్యుడు సత్యశేఖర్ మోశారు. అమ్మ సాగటానికి ముందు ఉభయగోదావరి, విశాఖ జిల్లాల నుంచి తెప్పించిన కళాబృందాలు కదులు తుండగా, వాటి వెనుక అనువంశిక పూజారి, అమ్మవారి దేవర, ఘటాలు పురవీధుల్లో జనవాహిని మధ్యసాగాయి. డోలు,సన్నాయి మోతలు, బ్యాండు బాజాలు, కోలాటాలు, చిరతలు, తీన్‌మార్ నృత్యాల నడుమ పండగ సాగింది. పట్టణంలో పలు వీధుల గుండా, పలు జంక్షన్ల మీదుగా సాగిన అనుపోత్సవం అర్ధరాత్రి వరకూ కొనసాగింది. అదే సమయంలో స్థానిక దారగంగమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. వన్ వే జంక్షన్ సమీపంలో శ్రీనాధు రామచంద్రరావు, జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. అమ్మ పండగలో అనువంశిక పూజారులు, సేవకులు, గ్రామపెద్దలతో పాటు పట్టణానికి చెందిన యువత, పోలీసులు అంతా పెద్ద ఎత్తున హాజరై ట్రాఫిక్ సమస్యలు లేకుండా, ఎక్కడా ఇబ్బందులు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు.



ఘటాల ఊరేగింపులో పూజారి గౌరినాయుడు, పెద్దలు



అమ్మవారి దేవరను మోస్తున్న డాక్టర్ సత్యశేఖర్



భక్తులకు మజ్జిగ సంపిణీ చేస్తున్న శ్రీనాధు రామచంద్రరావు కుటుంబీకులు



కోలాటం ఆడుతున్న మహిళల బృందం



నృత్యం చేస్తున్న కళాకారిణుల బృందం



ఆకట్టుకున్న అర్జున, శ్రీకృష్ణ, దుర్యోధనుల బళ్ల వేషాలు



అమ్మవారి వేషధారణతో ప్రదర్శన



కాంతార కళాబృందం ప్రదర్శన

జామి కళాశాల అభివృద్ధికి సహకరించండి

జామి: మండల కేంద్రంలో ప్రభుత్వం నూతనంగా జూనియర్ కళాశాల మంజూరు చేసిందని, ఈ ఏడాది నుంచి స్థానిక ఉన్నత పాఠశాలలో కళాశాల నిర్వహించనున్నా మని ఎంఈఓలు జయశ్రీ, గంగరాజు, హైస్కూల్ హెచ్ఎం అబ్దుల్ రెహమాన్ తెలిపారు. స్థానిక ఉన్నత పాఠశాల/కళాశాలలో మండల పరిధి ఉన్నత పాఠశాలల ఉపా ధ్యాయులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి అంతా సహకరించాలని కోరారు. ఈఏడాది కళాశాల లో ఎంపీసీ, సీఈసీ గ్రూపుల్లో ప్రవేశాలు కల్పించనున్నామని చెప్పారు. కళాశాలలో విద్యార్థులు చేరేలా గ్రామా ల్లో తమ వంతు ప్రచారం చేయాలని ఉపాధ్యాయులను కోరా రు. అలాగే కళాశాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సూచనలు, సలహాలు అందించాలన్నారు.